శిథిలావస్థలో పోలీస్ క్వార్టర్స్

- జిల్లా కేంద్రం నుంచి సిబ్బంది రాకపోకలు
- ఒక్కరూ నివాసం ఉండని వైనం
- నిరుపయోగంగా 30 పోర్షన్ల భవనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



పెదవేగిలో శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్





ఊడి పోయిన బాత్‌రూమ్ తలుపులు, చెత్తా చెదారంతో నిండిన క్వార్టర్స్ గదులు

పెదవేగి : సమాజంలోని ప్రజలు మనశ్శాంతిగా, నిర్భయంగా జీవనం సాగించాలన్నా, ఇళ్లలో ధైర్యంగా నిద్రించాలన్నా పోలీసుల సేవలు అత్యంత కీలకమైనవి. ఉదయం లేచిన దగ్గర నుంచి తమ ఇంటి బాధ్యతలు సైతం పక్కన పెట్టి వృత్తి ధర్మానికి కట్టుబడి సమాజంలోని ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకు, శాంతి భద్రతల కోసం అహర్నిశలు పోలీసులు పాటుపడతారు. అలాంటి ఈ రక్షక భటులు నివాసం ఉండేందుకు ఏర్పాటు చేసిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరి అధ్వానంగా దర్శనమిస్తోంది. పోలీసులకు ఏర్పడిన ఈ దయనీయస్థితి ఎక్కడో కాదు జిల్లా కేంద్రమైన ఏలూరుకు కూతవేటు దూరంలో ఉన్న జిల్లాలోనే పెద్ద మండలంగా పేరుగాంచిన పెదవేగి మండలంలో నెలకొంది. మూడు అంతస్తులు, 30 కుటుంబాలు నివాసం ఉండేలా 2006లో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి పుణ్యమా అని నిర్మించిన ఈ క్వార్టర్స్‌ను పట్టించుకునే వారు నాథుడు లేక శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఆ ప్రాంతం చిట్టడివిని తలపిస్తోంది. భవనాలు శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. క్వార్టర్స్ ప్రారంభంలో కొందరు ఉద్యోగులు ఇక్కడ నివాసం ఉండేవారు. వారు బదిలీ అయిన తరువాత క్వార్టర్స్‌ను పట్టించుకునేవారు లేక, నివాయోగ్యంగా లేకపోవడంతో ఒక్కొక్కరిగా బయటకు వెళ్లిపోయారు. ఇప్పుడు మొత్తం మూడు అంతస్తులకు ఒక్క కుటుంబం కూడా ఈ భవనంలో నివసించడం లేదు. అన్ని అంతస్తుల్లోని ప్రతి పోర్షను శిథిలావస్థకు చేరింది. ప్రతి పోర్షనులో శ్లాబు పెచ్చులూడిపోయి, తలుపులు ఊడిపోయాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తరచూ విషకీటకాలు, పురుగులు, పాములు ఈ క్వార్టర్స్‌లో చక్కర్లు కొడుతుంటాయి. క్వార్టర్స్‌లో ఉండలేక, సిబ్బంది ఏలూరులోనే నివాసం ఉంటూ డైలీ సర్వీసు చేస్తున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై, ఇద్దరు ఏఎస్సైలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లతో పాటు ఓ మహిళా కానిస్టేబుల్‌తో కలిసి మొత్తం 19 మంది సిబ్బంది ఉన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఈ క్వార్టర్స్ నిర్వహణను పట్టించుకున్న వారు కరువయ్యారు. అప్పట్లో అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేసి పోలీసు సిబ్బంది నివాసం ఉండేందుకు నిర్మించిన ఈ క్వార్టర్స్ క్రమేపీ క్షీణదశకు చేరాయి. ఆ క్వార్టర్స్‌లో నివాసం ఉండలేక వాటి దుస్థితిని ఎవరితో చెప్పుకోలేక ఉద్యోగులు సతమతమవుతున్నారు.

పారిశుద్ధ్య పరిరక్షణ అందరి బాధ్యత



గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కె.శ్రీదేవి

దెందులూరు: పారిశుద్ధ్య పరిరక్షణ అందరి బాధ్యత అని దెందులూరు ఎంపీడీఓ కే.శ్రీదేవి అన్నారు. సంపూర్ణ పారిశుద్ధ్య మండలంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని ఉద్యోగులకు సూచించారు. ఈ అంశంలో గురుతర బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉందని ఎంపీడీఓ అన్నారు. బుధవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా గ్రామ కార్యదర్శులందరూ ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ వారితో మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

దసరా ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది

నిడమర్రు : గ్రామాల్లోని మహిళలకు బ్యాంక్‌ల కార్యకలాపాలు, రుణాలు, పొదుపు వంటి వాటిపై అవగాహన కల్పించేందుకే చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వస్తున్నటు ఆ బ్యాంక్ విజిలెన్స్ అధికారి రాంబాబు అన్నారు. బుధవారం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నిడమర్రు బ్రాంచ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో దసరా ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ శ్రీదేవి మాట్లాడుతూ బ్యాంక్‌ల లక్ష్యాలు, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం హాజరైన ఖాతాదారులు, అధికారులతో సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి విజయ కుమార్, బ్యాంక్ మేనేజర్ ఆర్ శ్రీనివాస్‌బాబు తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



పార్టీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గొలుసు గణపతిరావు, కొమ్మిన రాము

దెందులూరు: వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి బలోపేతానికి మాజీ సొసైటీ చైర్మన్లు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఏలూరులో డీఎన్ఆర్‌ను దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు గొలుసు గణపతిరావు, కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు కొమ్మిన రాము మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో పార్టీ పరిస్థితి దాడులు, దౌర్జన్యాలపై వివరించారు. కొంతకాలం ఓపిక పట్టాలని అందరూ ధైర్యంగా ఉండాలని అందరికీ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తాము అంతా అండగా ఉంటామని ఆయన అన్నారు.

ఎరువుల వాడకం తగ్గించాలి



తోటగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

పెదపాడు: రైతులు ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం తగ్గించాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని తోటగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో వచ్చిన తెగుళ్లను నిర్ధారించుకుని వ్యవసాయ అధికారుల సలహాలతో మందులను పిచికారి చేయాలన్నారు. ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ వాటిల్లుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కాట్రం సురేష్, పెద్దిరెడ్డి రమేష్, వ్యవసాయ సహాయకుడు అజయ్ పాల్గొన్నారు.

పోస్టల్ రంగానిది ఎనలేని పాత్ర

భీమడోలు: దైనందిన జీవితంలో పోస్టల్ రంగానికి ఎనలేని పాత్ర పోషిస్తుందని సామాజిక కార్యకర్త మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పోస్టల్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండే సుధాకర్ పోస్టల్ డే విశిష్టతను చిన్నారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, పెద్దలు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణతో ఉపాధి



గోపన్నపాలెం సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ సెంటరులో ఉచిత కంప్యూటర్ శిక్షణ

దెందులూరు : భవిష్యత్తు అంతా కంప్యూటర్ పైనే ఆధారపడి ఉంటుందని గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్న యువత కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని గోపన్నపాలెం సెయింట్ ఫ్రాన్సిస్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌ఛార్జి బ్రదర్ జోసెఫ్ కుమార్ అన్నారు. బుధవారం ఇనిస్టిట్యూట్‌లో గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్న యువతకు ఉచితంగా శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేదల సంక్షేమం కంటే టీడీపీకి అక్రమార్జనే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



వాసుబాబు ఆధ్వర్యంలో జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఏలూరు తరలి వెళ్లిన నియోజకవర్గం నాయకులు

నిడమర్రు : నాడు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమం కోసమే పాలన సాగిస్తే.. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ నాయకుల అక్రమార్జనే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, ఉంగుటూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం ఏలూరులో నిర్వహించిన జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఉంగుటూరు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. బువ్వనపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి వాసుబాబు ఆధ్వర్యంలో నాలుగు మండలాల నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ఉచిత ఇసుక పేరుతో కూటమి నేతలు ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటూ సొమ్ములు చేసుకుంటున్నారన్నారు. నాడు గ్రామాల్లో బెల్ట్‌షాపులను నియంత్రించి ఊరికి దూరంగా ప్రభుత్వం మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే నేడు ప్రైవేటు మద్యం దుకాణాల ముసుగులో కూటమి నేతలే ఊరూ వాడా మద్యం విక్రయించేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. నిత్యావసర ధరలు మండిపోతున్నా చంద్రబాబు ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ధరలు పెరగడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం ఎక్కడా కనిపించడం లేదన్నారు. గతేడాది ఇదే సమయంలో రాష్ట్ర ప్రజలు ఎంతో సంతోషంగా దసరా జరుపుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ధరలు పెరిగితే ప్రభుత్వమే సరుకులు కొని తక్కువ ధరకు ఇచ్చినట్లు గుర్తు చేశారు. వాసుబాబు వెంట జెడ్పీటీసీలు కోడే కాశి, కొరిపల్లె జయలక్ష్మి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీటీసీ గంటా శ్రీనువాస్, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎలిశెట్టి పాపారావు బాబ్జి, మాజీ ఎంపీటీసీ కోడూరి రాంబాబు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెనుగొండ బాలకృష్ణ, రామకుర్తి నాగేశ్వరరావు, మిద్దే వెంకటేశ్వరరావు, రామిశెట్టి శ్రీను తదితరులున్నారు.

కొత్తూరులో పోలీసుల పల్లె నిద్ర



కొత్తూరులో పల్లెనిద్ర చేస్తున్న పోలీసులు

పెదపాడు: జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివకిశోర్, డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్ ఆదేశాల మేరకు పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై కట్టా శారదా సతీష్ మేరకు మండలంలోని కొత్తూరులో పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉండటం వల్ల సైబర్ నేరాలు అధికమయ్యాయని వీటిపై ప్రజలకు అవగాహన కల్పించినట్టు పోలీసులు తెలిపారు. సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ప్రభుత్వ పథకం వచ్చిందని మీ వ్యక్తిగత సమాచారాన్ని, ఆధార్ నంబరును, బ్యాంకు వివరాలను తెలియజేయాలని ఓటీపీ తెలపాలని వచ్చే ఫోన్ కాల్స్‌ను మెసేజ్‌లను నమ్మవద్దని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వారి వివరాలను పోలీసు స్టేషన్‌కు తెలియజేసిన వారి వివరాలను సమగ్రంగా తెలుసుకోవడానికి నేర చరిత్ర ఉపయోగపడుతుందని చెప్పారు. కుల, మత వర్గాల వారు కలిసి మెలిసి ఉండేలా పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారని చెప్పారు. గ్రామాల్లో వివాదాలు, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడితే పోలీసులకు సమాచారం అందిస్తే శాంతి కమిటీల ద్వారా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఇళ్లకు తాళం వేయడంతోపాటు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అటువంటి ఇంటిపై పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే సమయాల్లో సీసీ టీవీ లింకులను పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించేలా సంబంధిత లింకుల వివరాలను పోలీసు కంట్రోల్ రూమ్ నంబరు 8332959175 , 9550351100 నంబర్లకు తెలపాలన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



భీమడోలులో మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి

భీమడోలు: గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు కొనసాగిన శిక్షణ తరగతులు బుధవారం ముగిసాయి. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లుగా టి.ముత్తయ్య, వెంకట్రావు వ్యవహరించారు. గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీ, పంచాయతీరాజ్ చట్టాలు, హక్కులు, నిధుల సమీకరణ, వినియోగం, పారిశుద్ధ్య కార్యకర్తలు, చెత్త నుంచి సంపద తయారీ తదితర అంశాలపై వారికి శిక్షణ అందించారు. తొలుత నిర్వహించిన సమావేశానికి ఈవోపీఆర్డీ ఏ.సుందరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు చెత్త నుంచి సంపదను సృష్టించుకుని సొంతంగా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని కోరారు. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 13 గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



శిక్షణ పూర్తిచేసుకున్న ఉపసర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీలక్ష్మి

గణపవరం : పరిపాలనలో తొలిమెట్టు అయిన గ్రామ పంచాయతీలలోని ప్రజల సమస్యలను తీర్చడానికి వార్డు సభ్యులు కృషి చేయాలని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి అన్నారు. గణపవరం మండల కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన పంచాయతీ ఉప సర్పంచ్‌లు, సభ్యుల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను ఆచరణలో చూపాలని సభ్యులను కోరారు. క్షేత్రస్థాయి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, మాస్టర్ ట్రైనీలుగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శులు దైబాల రామాంజనేయులు, ఏ.భాస్కర్, జి.సతీష్ పాల్గొన్నారు.

బాల కళాకారులకు సత్కారం



గోపన్నపాలెంలో బాల కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: చిన్న వయస్సులోనే అసమాన ప్రతిభను ప్రదర్శించిన చిన్నారులందరూ అభినందనీయులని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ కమిటీ నిర్వాహకులు తోట రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, ప్రభాకరరావు అన్నారు. బుధవారం రాత్రి గోపన్నపాలెంలో అసమానత ప్రతిభ కనబరిచిన చిన్నారి కళాకారులను ఆలయ కమిటీ, గ్రామస్తులు సత్కరించారు. దసరా మహోత్సవాల్లో కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనల్లో చిన్నారులు విశిష్ట ప్రతిభను కనబరిచిన సందర్భంగా వారిని సత్కరించారు.

11 వరకూ జాతీయ తపాలా శాఖ వారోత్సవాలు

దెందులూరు: జాతీయ తపాలా వారోత్సవాలు 11వ తేదీ వరకు కొనసాగుతాయని జిల్లా పోస్ట్ ఆఫీస్ సూపరిటెండెంట్ ఎస్ శ్రీకర బాబు అన్నారు. బుధవారం దెందులూరు పోస్టాఫీసులో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న మెయిల్స్ పార్శిల్స్ దినోత్సవం, 8 న ఫిలాటెలీ దినోత్సవం, 9న ప్రపంచ తపాలా దినోత్సవం నిర్వహించామన్నారు. 10న ఆధార్ స్పెషల్ క్యాంప్ దినోత్సవం, 11న విట్టియ సశక్తి కారన్ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోస్టాఫీసుల్లో పోస్ట్‌మాస్టర్లు, సిబ్బంది జాతీయ తపాలా వారోత్సవాల విజయవంతానికి కృషి చేయాలన్నారు.

ఆటో యూనియన్ సేవలు స్ఫూర్తిదాయకం

భీమడోలు: భీమడోలు వేంకటేశ్వర ఆటో యూనియన్ సేవలు పలువురికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు పంచాయతీ పాలకవర్గం సమకూర్చిన స్థలంలో నిర్మించిన వేంకటేశ్వర ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ సంక్షేమ సంఘం నూతన కమ్యూనిటీ భవనాన్ని బుధవారం భీమడోలు సీఐ యూజే విల్సన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ఒక విభాగాన్ని ప్రారంభించారు. సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బాదర్వాడ కృష్ణమోహనరాజు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవికి సామూహిక పూజలు



నిడమర్రు : మందలపర్రు పంచాయతన క్షేత్రంలో సరస్వతి అలంకరణ



గణపవరం: సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



ఉంగుటూరు: భద్రకాళీ అలంకరణలో చల్లాలమ్మ



నిడమర్రు : అడవికొలనులో నవదుర్గలుగా పూజలందుకుంటున్న చిన్నారులు



దెందులూరు : సీతంపేటలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

నిడమర్రు: శరన్నవరాత్రుల సందర్భంగా అడవికొలను కేశ్వస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన సామూహిక సరస్వతీ దేవి పూజల్లో 150 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎంపిక చేసిన తొమ్మిది మంది చిన్నారులను నవదుర్గలుగా అలంకరించి ఆలయ అర్చకులు చక్రవర్తుల సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా భక్తులు ప్రత్యేక పూజల నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దల సహకారంతో చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు.శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు బుధవారం మండలంలోని దుర్గామాత ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలపర్రు ఉమానీల కంఠేశ్వరస్వామి ఆలయంలోని ఉమాదేవి అమ్మవారు. పెదనింద్రకొలను, అదే గ్రామంలోని తూర్పుపేట రామాలయం, బువ్వనపల్లి, పత్తేపురం , అడవికొలనులో దుర్గాదేవి సరస్వతి దేవి అలంకరణలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మూలానక్షత్రంలో సరస్వతీదేవిగా దర్శనం

గణపవరం: దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం మూలానక్షత్రం రోజున కనకదుర్గమ్మ వారిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. గణపవరంలోని కంచి కామాక్షి, కనకదుర్గ అమ్మవార్ల ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలకు ఆలయ కమిటీ చైర్మన్ తెలగారెడ్డి బాబి ఆధ్వర్యంలో పూజాసామగ్రి అందజేశారు. చినరామచంద్రపురంలో, బస్టాండు రామాలయం వద్ద కనకదుర్గమ్మను సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. వర్తక సంఘ భవనంలో వాసవీ అమ్మవారికి పూజలు నిర్వహించారు.

కైకరం సాయిబాబా ఆలయంలో పూజలు

ఉంగుటూరు: మండలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కై కరం సాయిబాబా ఆలయంలో బుధవారం పెదిరెడ్డి వేణుగోపాల కృష్ణప్రసాదరావు అండ్ శేషవేణి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పిల్లలతో సామూహిక సరస్వతీ పూజ నిర్వహించారు. గోపినాథపట్నంలో దేవి నవరాత్రి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉంగుటూరు భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. సుమారు 66 జంటలు పీటలు మీద కుర్చుని పూజలు చేశారు. గ్రామదేవత చల్లాలమ్మ భద్రకాళీ అవతారంలో కనిపించారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

దెందులూరు: దసరా మహోత్సవాల సందర్భంగా సీతంపేటలోని చిన్నారులకు మెయిన్‌సెంటరులో అమ్మవారి ఆలయ ఆవరణలో అక్షరాభ్యాసం చేయించారు. తొలుత అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపన్నపాలెంలో ఆలయ కమిటీ తోట రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, కమిటీ సభ్యులు కనకదుర్గమ్మ తల్లిని సరస్వతిదేవి అలంకరించి పూజలు చేశారు.

కుంకుమార్చనలు

భీమడోలు : దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయాల్లో కుంకుమార్చన పూజలు చేశారు. గుండుగొలను, కురెళ్లగూడెం, పూళ్ల, ఎంఎంపురం, భీమడోలు, నరెడ్లగూడెంలోని దుర్గామాతను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలవేల్పు భవానీ మాత సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. కురెళ్లగూడెంలో అమ్మవారు సరస్వతీదేవి హంస వాహనంపై దర్శనమిచ్చారు.

సరస్వతీ దేవి పాలరాతి విగ్రహం ఆవిష్కరణ



పూళ్లలో సరస్వతీ దేవి విగ్రహం, మందిరం వద్ద పూర్వ విద్యార్థులు, హెచ్ఎంలు

భీమడోలు: పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 1988–89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు చదువుల తల్లి సరస్వతీదేవి పాలరాతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు రూ.3 లక్షల నగదుతో పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహాన్ని, రక్షణగా మందిరాన్ని నిర్మించారు. దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారి మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని విగ్రహాన్ని ఆవిష్కరించి పూజలు చేశారు. సరస్వతీ దేవి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారంతా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పెనుగొండ భువనేశ్వరరావు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.